# సాక్షి జగిత్యాల

గురువారం । 15 ఆగస్టు । 2024


## పంద్రాగస్టుకు ఏర్పాట్లు

జగిత్యాల: పంద్రాగస్టు సంబరాలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో తొలిసారి వేడుకలు జరగనున్నాయి. కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, అడిషనల్ కలెక్టర్లు రాంబాబు, ఆర్డీవో మధుసూదన్ ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం ఉదయం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం ఉంటుంది.



# బాపూజీ కీర్తి.. స్వాతంత్య్ర స్ఫూర్తి



ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా..
ఏ పీఠమెక్కినా.. ఎవ్వరేమనినా..
పొగడరా నీతల్లి భూమి భారతిని..
నిలుపరా నీ జాతి నిండు
గౌరవమును..

1947 ఆగస్టు 15న ఆంగ్లేయుల బానిసత్వం నుంచి విముక్తి కలిగింది. అదేరోజు దేశానికి స్వాతంత్య్రం సిద్ధించింది. ప్రపంచంలో ఎక్కడున్నా భారతీయులందరూ పంద్రాగస్టును పండుగలాగా జరుపుకుంటారు. మనమంతా స్వేచ్ఛగా ఉన్నామంటే ఎందరో సమరయోధుల త్యాగాల ప్రతిఫలం. వారు దేశాన్ని ఎలా గొప్పగా చూడాలని కలలు కన్నారో.. ఆ కలలను సాకారం చేయడం మనందరి కర్తవ్యం. దేశ కీర్తిప్రతిష్టలు పెంపొందించడం అందరి బాధ్యత. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకోవడం మన ధర్మం. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా పలుగ్రామాలు స్వాతంత్య్రోద్యమం నడిపిన బాపూజీ బాటలో నడుస్తున్నాయి. ఆయన కలలు నిజం చేసేందుకు కదులుతున్నాయి. ఏ గ్రామంలో ఏ ప్రత్యేకత ఉంది..? ఎవరు ఎలా ముందుకెళ్తున్నారు..? ఎవరి ఆశయం ఏంటి తదితర వివరాలతో స్వాతంత్య్ర దినోత్సవ ప్రత్యేక కథనం..

## ఎర్రకోటపై 'వావిలాల' జెండా రెపరెపలు



వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్

జమ్మికుంట: దేశ స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో జమ్మికుంట మండలం వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ ఊపిరిపోసుకుంది. ఇక్కడి ఖాదీతో తయారైన జాతీయజెండా దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై రెపరెపలాడింది. మహాత్మాగాంధీ పిలుపు మేరకు విదేశీ వస్త్రాల బహిష్కరణ, స్వదేశీ వస్త్రాల తయారీ ఉద్యమంలో భాగంగా ఆయన శిష్యులు అన్నా సాహెబ్ సహస్ర బుద్దె, లేలేజీ జమ్మికుంట మండలం వావిలాల పరిసర ప్రాంతంలో పర్యటించారు. గ్రామంలో 1929లో మహారాష్ట్ర చరఖా సంఘ్‌ను ప్రారంభించారు. స్వాతంత్య్రం తరువాత 1951లో శ్రీ రామానంద తీర్థ, దివంగత ప్రధాని పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో భాగ్యనగర్ ఖాదీ సమితి పేరుతో పునః ప్రారంభించారు. భాగ్యనగర్ సంస్థ నుంచి 1967లో మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ విడిపోయింది. 1983లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ ఏర్పడింది. కాగా.. 1972లో దేశ రాజధాని ఢిల్లీలో ఆగస్టు 15, జనవరి 26 సందర్భంగా ఆవిష్కరించిన జాతీయ జెండాలు వావిలాల ఖాదీలో తయాలు చేసినవే. ప్రస్తు తం బెంగళూరు ఖాదీ సంస్థ జాతీయ జెండాలను తయారు చేస్తోందని వావిలాల ఖాదీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపా రు. వావిలాల ఖాదీ ప్రస్తుత చైర్మన్‌గా పీవీ నరసింహారావు కుమార్తె ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, వొడితెల కిషన్‌రావు కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

## మాట్లాడుకుందాం రమ్మని..



సైదాపూర్: ఎలబోతారం, రాములపల్లి, ఎల్లంపల్లి గ్రామాల్లో సుమారు 200 మందిమి ఒక్కటై రజాకార్లను ఎదిరించినం. మాలో నలుగురు రజాకార్ల చేతిలో చనిపోయింండ్రు. గుజ్జుల పుల్లారెడ్డిని ముక్కలుగా నరికి చంపిండ్రు. ఎకరం ఉన్నోడికి తాసీల్ కింద ఆరు కుంచాల వడ్లు తీసుకున్నరు. లేదా రూపాయి పావలా వసూలు చేసిండ్రు. పన్ను కట్టనోళ్లను వంగబెట్టి మీద బండలు ఎత్తింండ్రు. ఈ దురాగతాలు భరించలేక యువకులందరం ఎదురుతిర్గినం. గప్పుడే హైదరాబాద్ దొరసింగ్ మా కాడికి అచ్చిండ్రు. ఊళ్లలో సమావేశాలు పెట్టిండ్రు. చైతన్యం తెచ్చిండ్రు. రజాకార్లలో ఒకడిని, ప్రభువును మేం చంపినం. ఇగ గొడవులు అద్దు. మాట్లాడుకుందాం.. రమ్మన్నరు. ఎలబోతారంలో డేరా ఏసిండ్రు. ఖాసీ ఒరజ్వీ అక్కడికి పిలిచిండ్రు. నమ్మినం. 130 మందిమి అక్కడికి పోయినం. మమ్మల్ని హుజూరాబాద్ వరకు నడిపించిండ్రు. అక్కడ జైల్లో పెట్టిండ్రు. ఎలబోతారం, రాములపల్లి, ఎల్లంపల్లిలో 200 మందిలో 40 మందిని స్వాతంత్య్ర సమరయోధులుగా భారత ప్రభుత్వం గుర్తించింది. అందరూ చనిపోయింండ్రు. ఇప్పుడు నేనొక్కడినే ఉన్న.

– అంగిరిక రాజలింగం, స్వాతంత్య్ర సమరయోధుడు, ఎల్లంపల్లి, సైదాపూర్

## జగిత్యాలలో నిత్య జనగణమనకు ఆరేళ్లు

జగిత్యాలటౌన్/పెగడపల్లి: జగిత్యాలలో ఉత్తూరి గంగాధర్ నేతృత్వంలో 60 మందితో ప్రారంభించిన నిత్యజనగణమన కార్యక్రమం ఆరేళ్లకు చేరుకుంది. గడియారం వద్ద ప్రతీరోజు ఉదయం 9.15 గంటలకు జాతీయగీతం ప్రారంభమవుతుంది. 2018 అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజు ప్రారంభించిన కార్యక్రమం 2,140 రోజులుగా విజయవంతంగా కొనసాగుతోంది. పెగడపల్లిలోని అంబేడ్కర్‌చౌరస్తాలో 2022 ఏప్రిల్ 10వ తేదీ నుంచి నిత్య జనగణమన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

**వేములవాడలో నేటి నుంచి..**

వేములవాడ: నేటినుంచి నిత్యజనగణమన కార్యక్రమానికి వేములవాడ మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసింది. నిత్యం ఉదయం 9 గంటలకు నిత్యజనగణమన నిర్వహణకు రూ.5లక్షలు వెచ్చించి ప్రధాన కూడళ్లలో మైక్‌లు ఏర్పాటు చేయనున్నారు.



జాతీయ గీతాలాపనలో జగిత్యాల ప్రజలు

## ఇల్లే గ్రంథాలయం

• ఆదర్శంగా నిలుస్తున్న అధ్యాపకుడు

వేములవాడ: తన ఇంటిని గ్రంథాలయంగా మార్చుకున్నాడు. పౌర గ్రంథాలయం అంటూ బోర్డు ఏర్పాటు చేశాడు. రెండు వైపులా గేట్లు ఓపెన్ చేసి విద్యావంతులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాడు రిటైర్డ్ అధ్యాపకుడు వీరగోని ఆంజనేయులు గౌడ్. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన వీరగోని ఆంజనేయులు 1977లో వేములవాడకు వచ్చారు. 1978 నుంచి స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా పనిచేశారు. అనంతరం రాజన్న ఆలయానికి చెందిన సంస్కృత కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులుగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. రూ.15లక్షల పైచిలుకు ఖర్చు చేసి ఇళ్లంతా పుస్తకాలతో నింపేశారు. 'నాకు పుస్తకాలంటే అమితమైన ప్రేమ. అందరికీ విద్యను పంచాలన్నదే నా లక్ష్యం. నేటికి మా ఇంట్లో 65వేల వరకు పుస్తకాలున్నాయి. 50 ఏండ్ల పత్రికలు నేటికీ జాగ్రత్తగా దాచిపెట్టుకున్నా. ప్రతిరోజు 30 మంది వరకు వచ్చి చదువుకుంటారు. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా నాకు సత్కారాలు అందాయి'. అని ఆంజనేయులు వివరించారు.



తన ఇంటినే గ్రంథాలయంగా మార్చిన వీరగోని ఆంజనేయులు

## మామిడిపల్లిలో స్వాతంత్య్ర శిలాశాసనం



మామిడిపల్లిలో ఏర్పాటు చేసిన శిలాశాసనం

కోనరావుపేట: స్వాతంత్య్ర సమరయోధులను గుర్తిస్తూ భారత ప్రభుత్వం శిలాశాసనాలు ఏర్పాటు చేయించింది.ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా పోరాడిన స్వాతంత్య్ర సమరయోధులను గౌరవిస్తూ కోనరావుపేట మండలం మామిడిపల్లిలో శిలాశాసనం ఏర్పాటు చేసింది. స్వాతంత్య్రం వచ్చి పాతికేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని 1972 ఆగస్టు 14 నుంచి 1973 ఆగస్టు 14 మధ్యలో ఈ శిలాశాసనాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై స్వాతంత్య్ర సమరయోధులు శివనాగయ్య(నిమ్మపల్లి), వై.హన్మంతరావు(మామిడిపల్లి), భీమ్‌రాం గంగారామ్, వుట్కూరు నారాయణ, అనుముల మల్లయ్య, గోగు ఓగుల్‌రెడ్డి, కెప్టెన్ విజయరఘునందన్‌రావు, అనుముల ఓదెలు పేర్లు చెక్కారు. శిలాశాసనానికి రెండు వైపులా అశోకచక్రం, నెమలి, సింహం, తామరపుష్పం బొమ్మలు చెక్కారు. మామిడిపల్లిలోని పాఠశాల ఆవరణలో దీన్ని ఏర్పాటు చేయబడింది.



కె.సాయిరాం



సాయిరాం సేకరించిన గాంధీ చిత్రం

## మహాత్ముల జ్ఞాపకాలు పదిలం

సిరిసిల్లటౌన్: స్వాతంత్య్ర సంగ్రామంలో భారతజాతిని చైతన్య పరిచిన జాతీయ నాయకుల పోరాటాల జ్ఞాపకాలను సిరిసిల్లకు చెందిన కొత్వాల సాయిరాం పదిల పరిచాడు. సుమారు 3,500కు పైగా వ్యాసాలు, ఫొటోలు ఆయన సేకరించాడు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం చిత్రాలను సృజనాత్మకంగా భద్రపరిచాడు. ఇప్పటికీ వంద దేశాలకు పైగా స్టాంపులు సేకరించాడు. 1947లో దేశరాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై ఎగురవేసిన తొలి జెండావిష్కరణ ఫొటో ఆయన వద్ద ఉంది. గాంధీజీపై ఉన్న అభిమానంతో ఆయన ఛాయాచిత్రాలను వందల సంఖ్యలో సేకరించాడు.

## మద్యపాన నిషేధ పల్లెలు



గూడూరు గ్రామం

ముస్తాబాద్(సిరిసిల్ల)/కరీంనగర్‌రూరల్: మహాత్ముడి కలలు నిజం చేస్తూ పలు పల్లెలు సంపూర్ణ మద్యపాన నిషేధం పాటిస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామంలో 18ఏళ్లుగా మద్యం విక్రయాలు కొనసాగించడం లేదు. గ్రామంలో 2006లో అప్పటి సర్పంచ్ చీటి వెంకటనర్సింగరావు ఆధ్వర్యంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని పాటించాలని తీర్మానించారు. ఊర్లో ఎవరైన మద్యం విక్రయిస్తే రూ.10వేల జరిమానా విధించాలని నిర్ణయించారు. ఊరిలో గుట్కాలు, సిగరేట్ల విక్రయాలు కూడా నిషేధించారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో దాదాపు ఎనిమిదేళ్లుగా, హరిదాస్‌నగర్‌లో పదేళ్లుగా మద్యపాన నిషేధం కొనసాగుతోంది. కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేటలో పన్నెండేళ్ల నుంచి మద్యపాన నిషేధం కొనసాగుతోంది. గతంలో మద్యం అమ్మకంతో ఊరంతా తాగుబోతుల మయంగా మారి పలు వివాదాలేర్పడ్డాయి. గ్రామపెద్దలందరూ సమావేశమై గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించవద్దని, మద్యం అమ్మితే రూ.10వేల జరిమానా వసూలు చేయాలని నిర్ణయించారు. ఒకరికి జరిమానా సైతం విధించారు అప్పటి నుంచి కట్టుబాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

## నాడు భుక్తి కోసం.. నేడు దేశ రక్షణ కోసం

• ఉమ్మడి జిల్లా నుంచి సైన్యంలో సేవలందిస్తున్న వందలాది మంది యువత



గ్రామంలో పోలీసులు నిర్మించిన శాంతిస్తూపం

సారంగాపూర్: స్వాతంత్య్ర సమయంలో భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటం చేయగా.. ఇప్పుడు దేశరక్షణలో సేవలందిస్తున్నారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన యువత. వందలాది మంది ఆర్మీ, ఇతర రక్షణ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. కొందరు ప్రాణాలు సైతం కోల్పోయారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ గ్రామం 1985 నుంచి 2004 వరకు నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా ఉండేది. ఇది మావోయిస్టు అగ్రనేత ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి స్వగ్రామం. మావోలను అదుపు చేయడానికి పోలీసులు చేపట్టిన చర్యలతో ఇరువర్గాలవారు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల చేతిలో మరణించిన పేరున మావోయిస్టులు ఇక్కడ స్మారక స్తూపాన్ని నిర్మించారు. పోలీసులు కూడా అమరులైన వారి పేరిట శాంతి స్తూపాన్ని నిర్మించారు. పోలీసులు మావోల చర్యలను అరికడుతూనే యువతను ఉద్యోగం, ఉపాధి వైపు ప్రోత్సహించారు. ఈ చర్యలు సత్ఫలితానిచ్చాయి. గ్రామం నుంచి సైన్యంలోకి, పోలీస్ ఉద్యోగాలకు వెళ్లవద్దని మావోలు పిలుపునివ్వగా.. పోలీస్‌శాఖ తీవ్రంగా పరిగణించి ఇక్కడి యువతను సైన్యంలో, పోలీస్ ఉద్యోగాల్లో చేరడానికి ప్రోత్సహిస్తూ వచ్చింది. ఇలా ఈ గ్రామానికి చెందిన 15 మంది యువకులు సైన్యంలో చేరారు. గ్రామానికి చెందిన బోదాసు తిరుపతి, పల్లపు రమేశ్, తాళ్లపల్లి హరీశ్, పంజాల నరేశ్, సాకపురపు రాజేందర్, చల్ల రాకేశ్, అల్లకొండ సతీశ్, తుమ్మనపెల్లి నరేందర్, నరిగె వెంకటేశ్, అజ్మీరా రాజ్‌కుమార్, కందుల శ్రీనివాస్, పంజాల సురేశ్ వివిధ భద్రతా దళాల్లో పనిచేస్తున్నారు.

## బోయినపల్లి నుంచి ఐదుగురు.. మల్కాపూర్ నుంచి ముగ్గురు



పబ్బాల అనిల్(ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండల యువకులు సైన్యంలో చేరి తమ దేశభక్తిని చాటుకుంటున్నారు. బోయినపల్లితోపాటు మల్కాపూర్‌కు చెందిన యువకులు ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నారు. బోయినపల్లికి చెందిన పర్లపల్లి శేఖర్, బైరి అనిల్, మొగులోజి మహేందర్ సైనికులుగా పనిచేస్తున్నారు. దూస శ్రీనివాస్ ఆర్మీ జవాన్‌గా ఉద్యోగ విరమణ పొందారు. నల్లగొండ కృష్ణ సీఆర్‌పీఎఫ్‌లో కశ్మీర్‌లో విధులు నిర్వహించి ప్రస్తుతం సివిల్ ఎస్సైగా కొనసాగుతున్నారు. యాద శశి ఇటీవల సైన్యంలోకి ఎంపికై బేసిక్ ట్రెయినింగ్ పొందుతున్నారు. మల్కాపూర్‌కు చెందిన మెట్టు కుమార్, అకెన అనిల్ ఆర్మీలో పనిచేస్తున్నారు.

**హెలీకాప్టర్ ప్రమాదంలో అనిల్ మృతి**

బోయినపల్లి మండలంలోని మల్కాపూర్‌కు చెందిన పబ్బాల అనిల్(29) 2023, మే 4న జమ్మూకశ్మీర్‌లో జరిగిన హెలీకాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఇంటర్ వరకు చదివిన అనిల్ 11 ఏళ్ల క్రితం ఆర్మీలో చేరారు. జమ్మూకశ్మీర్ ఆర్మీ సీఏఎస్ విభాగంలో వీఎస్ టెక్నీషియన్‌గా పని చేసేవారు.

## సైనికుల కొండ...మారేడుగొండ

పెద్దపల్లిరూరల్/శంకరపట్నం: పెద్దపల్లి మండలం మారేడుగొండ గ్రామం నుంచి 20మందికి పైగా యువకులు సైన్యంలో పనిచేస్తున్నారు. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన యువకులు ఆర్మీలో ఉన్నారు. పిడుగు హరీశ్ అతని సోదరుడు ఆర్మీలోనే పనిచేస్తున్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఏరడపల్లి గ్రామం నుంచి జంగిలి శ్రీనివాస్‌యాదవ్ మొట్టమొదట సైన్యంలో చేరాడు. ఆయన బాటలో 26మంది సైన్యంలో చేరి సేవలందిస్తున్నారు.

**దేశభక్తి పెంపొందించుకోవాలి**



యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి. దేశరక్షణకు పాటుపడాలనే తపన అందరిలో ఉండాలి. దేశసేవ చేయడంలో ఎంతో తృప్తి ఉంటుంది. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేలా సైన్యంలో చేరా.

– టి.ప్రశాంత్, మారేడుగొండ

**మా ఊరు ప్రత్యేకం**



సీఆర్‌పీఎఫ్ తదితర విభాగాల్లో మా ఊరి నుంచి ఎక్కువ మంది పనిచేస్తున్నారు. దీంతో మా మారేడుగొండకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. 2015లో సైన్యంలో చేరిన. అరుణాచల్‌ప్రదేశ్ ప్రాంతంలో చైనా సరిహద్దు దాకా వెళ్లి పనిచేయడం ఎంతో అనుభూతినిచ్చింది.

– వి.మధుకర్, మారేడుగొండ

## న్యూస్‌రీల్

### మహిళా సాధికారతలో మెట్‌పల్లికి మొదటిస్థానం



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మెప్మా సిబ్బంది

జగిత్యాల: స్త్రీనిధి ద్వారా బ్యాంకు రుణాలు అందుకుని మహిళలు సాధికారత సాధించడంతోపాటు, వందశాతం రుణాలు రికవరీ సాధించినందుకు మెట్‌పల్లి పట్టణ మహిళాసంఘానికి గుర్తింపు లభించింది. రాష్ట్రంలోనే మెట్‌పల్లి మహిళాసంఘం మొదటిస్థానంలో నిలిచింది. మహిళాసమైక్య మహిళలకు రుణాలు అందిస్తూ వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా కృషి చేసింది. స్వయం ఉపాధి పొందడంలోనూ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి మొదటిస్థానంలో నిలిచింది. అవార్డును హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతులమీదుగా మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్, టీఎంసీ శివకుమార్, పట్టణ మహిళా సమైక్య అధ్యక్షురాలు బబ్బూరి లక్ష్మీ అందుకున్నారు.

### అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



జడ్జికి రాఖీ కడుతున్న మహిళాన్యాయవాది

ధర్మపురి: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ అన్నారు. ధర్మపురి కోర్టు ఆవరణలో బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. జడ్జితోపాటు ఇతర న్యాయవాదులకు మహిళాన్యాయవాది రాఖీలు కట్టారు. జడ్జి మాట్లాడుతూ అమ్మలోని ప్రేమను, నాన్నలోని బాధ్యతను స్వీకరించే సోదరుడికి కట్టే కంకణమే రాఖీ అన్నారు. అసిస్టెంట్ ప్లీడర్ రౌతు రాజేశ్, న్యాయవాదులు రామడుగు రాజేశ్, జాజాల రమేశ్, జితేందర్‌రెడ్డి, బత్తిని ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాజు





రాజు, చైర్మన్, వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని కొమటికొండాపూర్‌కు చెందిన బొరిగం రాజు, వైస్ చైర్మన్‌గా అమ్మక్కపేటకు చెందిన ఎలాల వెంకట్‌రెడ్డితోపాటు 12మంది సభ్యులను నియమిస్తూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. రాజు బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు చైర్మన్ పదవిని ఆశించి అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును కోరినా ఫలితం దక్కలేదు. దీంతో రాజు అసెంబ్లీ ఎన్నికల ముందు జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జువ్వాడి ఇచ్చిన హామీ మేరకు మార్కెట్ చైర్మన్ పదవికి ఏడుగురు పోటీపడినా రాజుకే అవకాశం ఇచ్చారు.

### ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా అధికారులు

జగిత్యాల: కలెక్టర్లు ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను నిత్యం తనిఖీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ నిర్ధారణకు ఆస్పత్రుల్లో రక్తపరీక్షలు ఎక్కువగా చేయాలని, రోగులకు మెరుగైన సేవలందించాలని పేర్కొన్నారు. ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా ఉంచాలని, అవసరమైన కేసులను మాత్రమే అడ్మిట్ చేసుకునేలా చూడాలన్నారు. అవసరం లేకున్నా.. రక్తం ఎక్కించడం, మెడిసిన్ ఇవ్వడం వంటివి ఇవ్వకుండా చూడాలని ఆదేశించారు. గురుకులం విద్యాలయాలు, హాస్టళ్లను సందర్శించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ప్రతినెలా స్వచ్ఛదనం, పచ్చదనం నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

### జీవనభృతి రూ.4 వేలు ఇవ్వాలి

కోరుట్లటౌన్: బీడీ కార్మికులు, ప్యాకర్లకు చేయూత పథకం కింద ప్రతినెలా రూ.4 వేల జీవనభృతి ఇవ్వాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీవనభృతి చెల్లించాలన్నారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ ప్రతినిధులు జిందం ప్రసాద్, ఆరెల్లి భీమయ్య, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ధర్మపురి గోదావరిలో పుణ్య స్నానాలకై తరలివచ్చిన భక్తులు



### గోదావరి తీరం భక్తజన సంద్రం

ధర్మపురి: ధర్మపురి వద్ద గోదావరి బుధవారం భక్తజన సంద్రంగా మారింది. శ్రావణమాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



టీఆర్‌నగర్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జైపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మాతాశిశు సంరక్షణాధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రం శివారు టీఆర్‌నగర్‌లో పలువురు డెంగీ వ్యాధితో బాధపడుతుండగా.. ఆ ప్రాంతంలో పరిసరాలను పరిశీలించి నీటి నిల్వలను తొలగించడంతోపాటు, పారిశుధ్య పనులు చేయించారు. స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సమీప ప్రాంతాల ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షించారు. నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కాలువలో పడి రైతు దుర్మరణం


భీమయ్య మృతదేహం

జగిత్యాల: పొలానికి నీరు పెట్టొస్తానని వెళ్లిన ఓ రైతు కెనాల్ సైడ్‌వాల్‌లో పడి దుర్మరణం పాలైన ఘటన మేడిపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మేడిపల్లికి చెందిన వేములవాడ భీమయ్య (65)కు శివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లిన ఆయన పక్కనున్న కాలువ నుంచి నీటిని బకెట్‌తో తీసుకొస్తుండగా ప్రమాదవశాత్తు అందులోనే పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. భీమయ్యకు ఇద్దరు కొడుకులున్నారు. మృతుడి భార్య రాజనర్సు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్‌హౌస్ ఆఫీసర్ ఎండీ. ఇలియాజ్ అహ్మద్ తెలిపారు.

### డైట్‌లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా డైట్ కళాశాలలో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మొండయ్య తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ బోధించేందుకు, కళావిద్య, వ్యాయామ విద్య ఉపన్యాసకులు, ఉర్దూ మాధ్యమంలో సాంఘికశాస్త్ర ఉపన్యాసకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనున్నామని, ఆసక్తి, అర్హత ఉన్నవారు 21 వరకు స్వయంగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# జీజీహెచ్‌లో తొలి మోకీలు మార్పిడి

- 63 ఏళ్ల వృద్ధురాలి ఆపరేషన్ సక్సెస్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో తొలిసారి ఓ వృద్ధురాలికి మోకీలు(టీకేఆర్) శస్త్రచికిత్స ఉచితంగా చేసి ప్రశంసలు అందుకున్నారు. బాధితురాలు బుధవారం సులభంగా నడటంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. గోదావరిఖని సంజయ్‌నగర్‌కు చెందిన ఆర్.లింగమ్మ(63) ఏడాదిగా రెండు మోకాళ్లతో నరకయాతన అనుభవిస్తోంది. జీజీహెచ్ వైద్యులకు తన బాధ చెప్పింది. పరీక్షించిన డాక్టర్లు.. నొప్పి అధికంగా ఉన్న ఎడమ కాలుకు తొలత శస్త్ర చేయడానికి నిర్ణయించారు. ఈనెల ఒకటో తేదీన ఆర్థోపెడిక్‌లు రాజు, నాగిరెడ్డి, యాకూబ్‌తోపాటు అనెస్తీషియా ఆధ్వర్యంలో మోకీలు మార్పిడి ఆపరేషన్ విజయంతంగా నిర్వహించారు. బుధవారం లింగమ్మను సపోర్టు లేకుండానే నడిపించారు. సులువుగా నడవడంతోపాటు నొప్పి లేకపోవడంతో వైద్యులకు కృతజ్ఞతలు తెలిపింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, ఆర్ఎంవో అరుణ బాధితురాలిని అభినందించారు. జిల్లాలోనే తొలిసారి విజయంతంగా మోకీలు మార్పిడి చేసిన వైద్యులనూ అభినందించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒక కాలు మోకీలు ఆపరేషన్‌కు రూ.2లక్షల – రూ.3లక్షల వరకు ఖర్చవుతుందని, జీజీహెచ్‌లో ఉచితంగా సేవలు అందించామని వివరించారు.


వైద్యులను అభినందిస్తున్న సిమ్స్ ప్రిన్సిపాల్

# దేశభక్తిని చాటిన తిరంగా సైకిల్ ర్యాలీ

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన తిరంగా సైక్లింగ్ ర్యాలీ ఉత్సాహంగా, ఉల్లాసంగా దేశభక్తిని నింపేలా సాగింది. అంతకుముందు ఈ ర్యాలీని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ సంఘం, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి, అధ్యక్షుడు బుర్ర మధుసూధన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్యం చాలా ఆదర్శనీయమైందని, ఇతర దేశాలకు మార్గదర్శకమని అన్నారు. ప్రతీ ఒక్కరు దేశం పట్ల విధేయతను ప్రదర్శించడమే కాకుండా దేశానికి అన్ని వేళల్లో చేయూతనివ్వాలన్నారు. వావిలాలపల్లి కోర్టు చౌరస్తా నుంచి ఆర్‌అండ్‌బీ చౌరస్తా మీదుగా తెలంగాణ చౌక్ వరకు ర్యాలీ సాగింది. ప్రధాన కార్యదర్శి సురభి వేణుగోపాల్, సభ్యుడు అరవింద్‌బాబు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

## ప్రియుడి ఇంటిముందు బైఠాయింపు

శంకరపట్నం: తనకు న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటిముందు ఓ యువతి బుధవారం బైఠాయించింది. వివరాల్లోకి వెళ్తే..మొలంగూర్ గ్రామానికి చెందిన కల్లూరి భూపేష్, చీకట్ల సౌమ్యశ్రీ నాలుగు నెలలక్రితం ప్రేమపెళ్లి చేసుకొని హైదరాబాద్‌లో ఉంటున్నారు. 15 రోజుల క్రితం ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఎవరి ఇళ్లకు వారు వెళ్లారు. సౌమ్య శ్రీ భూపేష్‌కు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో పుట్టింటివారితో కలిసి తనకు న్యాయం చేయాలంటూ ఇంటిముందు బైఠాయించింది. సమాచారం తెలుసుకున్న ఏఎస్సై సుధాకర్ మొలంగూర్ చేరుకొని విషయంపై ఆరాతీశారు. భూపేష్, సౌమ్యశ్రీకి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రవి కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా సౌమ్యశ్రీకి ఇదివరకే మరొకరితో వివాహం జరిగిందని, భూపేష్ కారణంగానే భర్తతో విడిపోయినట్లు బంధువులు తెలిపారు.

## ఉచిత శిక్షణను వినియోగించుకోండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: నిరుద్యోగులకు నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్స్ పలు కోర్సుల్లో ఇస్తున్న ఉచిత శిక్షణను వినియోగించుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. న్యాక్ ఆధ్వర్యంలో రూపొందించిన ఉచిత శిక్షణ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. నిరుద్యోగ యువత కోసం న్యాక్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్, ల్యాండ్ సర్వేయర్, ప్లంబర్, వెల్డింగ్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**వేడుకలను ఘనంగా నిర్వహించాలి**

స్వాతంత్ర్య వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ ఉంటుందని, పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్య అతిథి జెండా ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. పరేడ్‌గ్రౌండ్‌లో అంబులెన్స్, మెడికల్ ఆఫీసర్ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని, విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం అధికారులు, ప్రజాప్రతినిధులకు సీట్లు కేటాయించాలని, విద్యార్థులు ఎండలో సాంస్కృతిక నృత్యాలు చేయనున్న దృష్ట్యా వారికి వసతులు కల్పించాలన్నారు. మహాలక్ష్మి, గృహలక్ష్మి, ఆరోగ్యశ్రీ, రుణమాఫీ, రైతుబీమా, ఆయిల్ పాం స్టాళ్ల ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి, ఏవో హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

## ఫుడ్‌సేఫ్టీ అధికారి పేరుతో బెదిరింపు

- రూ.12,336 ఫోన్‌పే చేయాలని ఒత్తిడి

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని గోవిందుపల్లిలో శ్రీగణేశ్ కిరాణం షాపు యజమాని రాజన్నకు బుధవారం ఫుడ్‌సేఫ్టీ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతున్నానంటూ.. ఫుడ్‌లైసెన్స్ ఉందా అని బెదిరింపులకు పాల్పడ్డాడు. పదేళ్లుగా లైసెన్స్ తీసుకోకుండానే కిరాణం షాపు నిర్వహిస్తున్నారని, రూ.2లక్షల జరిమానా, జైలుశిక్ష పడుతుందని, కిరాణంషాపును సీజ్ చేసి కోర్టుకు పంపిస్తామని బెదిరించాడు. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పంపిస్తున్నానని, వివరాలు అందులో పొందుపర్చి పంపాలని అనడంతో బెదిరిపోయిన షాపు యజమాని తన వివరాలను పంపించాడు. మూడేళ్లకు రూ.12,336 ఫోన్‌పే ద్వారా చెల్లించాలని, రశీదులు ఫోన్‌లో పంపుతానని చెప్పడంతో అనుమానించిన షాపు యజమాని అప్రమత్తమై స్థానిక ఫుడ్‌సేఫ్టీ అధికారిని సంప్రదించాడు. వారు తమకు సమాచారం లేదని తెలపడంతో వ్యాపారి ఊపిరి పీల్చుకున్నాడు.

## దేశ సమైక్యతను చాటుదాం


జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పెగడపల్లి: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ సమైక్యతను చాటుదామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్, నంది విగ్రహం వరకు బైక్ ర్యాలీ తీశారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేయాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, నరేందర్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు కిశోర్, మల్లేశం, బాబు, రాజు. గట్టయ్య, ఇంద్రనాయక్, భాస్కర్ రెడ్డి, రాజేశం, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

# బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- 16 గంటల్లో కేసును చేధించిన పోలీసులు
- తల్లిదండ్రులకు చిన్నారి అప్పగింత
- నిందితుడి పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలో సంచలనం సృష్టించిన బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. 16 గంటల్లోనే చేధించారు. నిందితుడిని పట్టుకొని చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలను విలేకరులకు వెల్లడించారు. స్థానికంగా నివాసముండే రాజు, లక్ష్మి దంపతులకు అమ్ములు(7), శివ (2) పిల్లలు. మంగళవారం సాయంత్రం దుబ్బవాడలో అమ్ములు తన తమ్మునితో కలిసి వెళ్తుండగా.. ముఖానికి మాస్క్ ధరించి ఓ వ్యక్తి బైక్‌పై వారి వద్దకు వచ్చాడు. అమ్ములుకు డబ్బులిచ్చి 'దుకాణానికి వెళ్లి చాక్లెట్లు కొనుక్కోని రా.. అంతవరకు మీ తమ్ముని పట్టుకుంటాను' అని చెప్పి పంపించాడు. ఆమె అక్కడకు వెళ్లి తిరిగి వచ్చే లోపే చిన్నారితో పరారయ్యాడు. అమ్ములు వెంటనే తల్లిదండ్రుల వద్దకు వచ్చి విషయం చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్పీ అశోక్‌కుమార్ వెంటనే డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు పర్యవేక్షణలో మెట్‌పల్లి, కోరుట్ల, సీసీఎస్ సీఐలు నిరంజన్‌రెడ్డి, సురేష్, లక్ష్మీనారాయణ, ఎస్సైలు చిరంజీవి, అనిల్, కిరణ్, రాజును ఆరు బృందాలుగా ఏర్పాటు చేసి నిందితుని కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. సంఘటన ప్రాంతంలో సీసీ పుటేజీలను పరిశీలించారు. చిన్నారిని ఎత్తుకెళ్తున్న దృశ్యాలను సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. పలువురు ఇచ్చిన సమాచారం ఆధారంగా నిందితుడు ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేటకు చెందిన ఇస్లావత్ నాగేష్‌గా గుర్తించారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వెంకట్రావ్‌పేట శివారులో నాగేష్ బాలుడితో బైక్‌పై వెళ్తుండగా పట్టుకుని అరెస్ట్ చేశారు. అనంతరం చిన్నారిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును కొన్ని గంటల్లోనే చేధించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కిడ్నాప్ కథ సుఖాంతం కావడంపై పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.


బాలుడి కుటుంబ సభ్యులతో ఎస్పీ, పోలీస్ సిబ్బంది

**గతంలో ఇద్దరు బాలికల విక్రయం?**

గతంలో తాను ఇద్దరు బాలికలను విక్రయించినట్లు నిందితుడు నాగేష్ పోలీసుల విచారణలో అంగీకరించినట్లు సమాచారం. మెట్‌పల్లి పట్టణంలో ఒకరికి, మేడిపల్లి మండలంలోని పోరుమల్ల గ్రామంలో ఒకరికి విక్రయించినట్లు పోలీసులకు తెలిపినట్లు తెల్సింది. అతడిచ్చిన సమాచారంతో బుధవారం రాత్రి బాలికలను కొనుగోలు చేసిన వారి వద్దకు పోలీసులు వెళ్లి వివరాలు సేకరించినట్లు సమాచారం.

## బస్టాండ్‌లో తప్పిపోయిన బాలిక.. తల్లిదండ్రులకు అప్పగింత

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని కొత్తబస్టాండ్‌లో ఓ బాలిక తప్పిపోయింది. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించగా.. కానిస్టేబుల్ చంద్రశేఖర్ బస్టాండ్‌కు వెళ్లి పాపను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. పాప తల్లిదండ్రుల కోసం పోలీసుయంత్రాంగానికి సమాచారం అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మోయినికుంటకు చెందిన చింతలస్వామి, అలీమ కూతురు వర్షతోపాటు బంధువులతో కలిసి బుధవారం ఉదయం ధర్మపురి గోదావరిలో పుణ్యస్నానానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా జగిత్యాల కొత్తబస్టాండ్‌లో వేములవాడ వెళ్లే బస్సు ఎక్కుతున్న తరుణంలో పాపను మర్చిపోయారు. కుటుంబ సభ్యులంతా వేములవాడకు చేరుకున్న తర్వాత వర్ష కనిపించకపోవడంతో అక్కడి ఆర్టీసీ కంట్రోలర్ జగిత్యాలలోని కొత్తబస్టాండ్ కంట్రోలర్‌కు సమాచారం అందించారు. ఆయన పాప జగిత్యాల పోలీసుల వద్ద ఉందని తెలపడంతో తల్లిదండ్రులు వేములవాడ నుంచి వచ్చి పాపను తీసుకెళ్లారు.


పాపతో పట్టణ సీఐ వేణుగోపాల్

# ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్‌ఎస్‌పై నెట్టడమా..?

- బీఆర్‌ఎస్ పోరాటంతోనే గురుకులాల సందర్శన
- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మల్లాపూర్: రాష్ట్రంలోని గురుకులం హాస్టళ్లలో పిల్లలు చనిపోతున్నా.. పదుల సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రి పాలవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం.. బీఆర్‌ఎస్ పోరాటంతో దిగివచ్చి గురుకులాలను సందర్శించిందని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గురుకులంలో విద్యార్థుల మృతి, అస్వస్థతకు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడడం దారుణమన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా పాలన చేతకాక ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్‌ఎస్‌పై నెడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యేవరకూ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని తెలిపారు. అనంతరం 8 గ్రామాలకు చెందిన 38 లబ్ధిదారులకు రూ.8.53 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, మాజీ వైస్ ఎంపీపీ గొరు నాగేష్ నాయకులు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## మార్కెట్ ధర చెల్లించండి

మెట్‌పల్లిరూరల్: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న తమకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించేలా చూడాలని మెట్‌పల్లి మండల రైతులు ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను కలిసి విన్నవించారు. ఎంతో విలువైన తమ వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు మార్కెట్ ధర కంటే తక్కువ పరిహారం చెల్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అదే జరిగితే తాము నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ ధర ప్రకారం పరిహారం వచ్చేలా చూసి తమకు న్యాయం చేయాలన్నారు. రైతు మారు మురళీధర్‌రెడ్డి ఉన్నారు.

**జర్నలిస్టుల ఇళ్ల సాధనలో అండగా ఉంటా**

జగిత్యాలటౌన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేవరకూ అండగా ఉంటానని ఎంపీ అర్వింద్ అన్నారు. జగిత్యాల ఆర్డీవో కార్యాలయం వద్ద పాత్రికేయులు చేపట్టిన నిరవధిక దీక్షకు సంఘీభావం తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరుకు తనవంతు కృషి చేస్తానన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, పట్టణ అధ్యక్షుడు రంగు గోపాల్, నాయకులు ఉన్నారు. అనంతరం ఎంపీ కలెక్టర్‌ను కలిశారు. పెద్దాపూర్ గురుకులం ఘటన, పెండింగ్ సమస్యలపై చర్చించారు.